www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
01.02.2025



# తేల్చుకుందాం రా!

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- నన్నుకొట్టుడు కాదు.. సరిగ్గా నిలబడు ముందు
- ఫామ్‌హౌస్‌లో ఉండి కబుర్లు చెప్పకు
- అసెంబ్లీకి వచ్చి మాట్లాడు
- ఎక్కడో ఉండి సోయి లేని సోది చెప్పకు
- అచ్చోసిన అంబోతుల్లా కొడుకును, అల్లుడుని ఊరిమీదకు వదిలినవ్
- సోషల్ మీడియా లైక్‌లు చూసి సంబురమా..?
- మేం అన్ని పథకాలు అమలు చేస్తున్నాం
- మీలా ఇచ్చిన హామీలు మేం ఎగ్గొట్టం
- పాలమూరును ఎండబెట్టిన దుర్మార్గులు మీరు
- రైతులకు రుణమాఫీ చేసింది మేమే
- మొగిలిగిద్ద బహిరంగ సభలో

- గంభీరంగా, మౌనంగా అన్నీ గమనిస్తున్నా..
- ప్రజలు సంతోషంగా లేరు
- పోరాటంతో ప్రభుత్వం మెడలు వంచుడే
- ప్రాజెక్టులు ఆగమైనయ్
- నెలాఖరులో భారీ బహిరంగ సభ

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

'నేను కొడితే మామూలుగా కాదు.. ప్రభుత్వ మెడలు వంచుతాం..' అని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో శుక్రవారం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానన్నారు. తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి

మిగతా 2లో



# నేను కొడితే మామూలుగా ఉండదు

## బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

### అభయారణ్యం గుండా వెళ్లే

# వాహనాలకు రుసుము

## జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలోని చెన్నూరు డివిజన్ ప్రాణహిత కృష్ణ జింకల వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన మార్గం గుండా వెళ్లే వాహనాల నుండి పర్యావరణ రుసుము వసూలు చేయనున్నట్లు జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ తెలిపారు. చెన్నూరు డివిజన్ పరిధిలోని ప్రాణహిత కృష్ణ జింకల అభయారణ్యంలోకి ప్రవేశించే వాహనాలకు పర్యావరణ రుసుము వసూలు చేసేందుకు యెంచపల్లి రక్షిత అటవీ ప్రాంతంలోని కంపార్ట్మెంట్ నం.329 లో, కోటపల్లి క్షేత్రంలోని పార్వల్లి, చెన్నూర్ క్షేత్రంలోని కిష్టంపేట బీట్ వై జంక్షన్ వద్ద రెండు చెక్ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు. అభయారణ్యం గుండా వెళ్లే రహదారిలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిల్స్, ఆహార పదార్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు పర్యావరణ రుసుము వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.





# యాసంగికి దేవాదుల నీరు

## విడుదల చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**కలంజ్యోతి, నల్లబెల్లి :** మేడిపల్లి, మామిళ్ల చెరువుల ఆయకట్టు రైతులకు యాసంగి పంటకి సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మెగా ఇంజినీర్లు ఆదినారాయణ, శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
శనివారం 01.02.2025



# తేల్చుకుందాం రా!

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకుంటానంటూ తమను భయపెట్టే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ముందు సరిగ్గా నిలబడడం నేర్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చురకలంటించారు. గంభీరంగా... మౌనంగా ప్రభుత్వాన్ని చూస్తూ వస్తున్నాననీ త్వరలోనే కాంగ్రెస్ పై దండయాత్ర చేస్తానంటూ చేసిన ప్రకటనను రేవంత్ రెడ్డి సవాలుగా స్వీకరించారు. నన్ను బలంగా కొట్టే సంగతి పక్కన బెట్టి.. ముందుగా సరిగ్గా, నిబ్బరంగా నిలబడడం నేర్చుకోవాలని కేసీఆర్ కు సవాల్ విసిరారు. కేసీఆర్ కు తన నాయకత్వంపై నమ్మకం ఉంటే అసెంబ్లీకి రావాలన్నారు.ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి గత ప్రభుత్వ హయాంలో చేసిన ఖర్చులు..అవినీతి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎక్కడో ఉండీ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోన్న ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. ఫామ్‌హౌస్‌లో ఉండి సోయి లేకుండా..సోది మాట్లాడవద్దని సూచించారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని ప్రజలు నమ్మే వాస్తవాలను చెప్పాలన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలన్నారు. తనను గంభీరంగా చూస్తున్నానంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం విరుచుకుపడ్డారు. నన్ను అలా చూడాలంటే ముందు గుండెను నిబ్బరపర్చుకోవాలన్నారు. కొడుకు, అల్లుడిని అచ్చోసిన ఆబోతుల్లా ఊరిమీదకు వదిలారని కేటీఆర్, హరీశ్ రావులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్నకు నిధులు ఇస్తానని మోసం చేసిన కేసీఆర్.. పాలమూరు జిల్లాను ఎరవేసి ఎండబెట్టిన దుర్మార్గుడన్నారు. రైతులకు ఎన్ని రుణమాఫీలు చేశారో రాష్ట్ర ప్రజానికానికి వివరంగా చెప్పాలన్నారు. 2023లో తాము అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం రూ.7 లక్షల కోట్లు అప్పుల్లో ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.18వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసిందన్నారు. అయితే ఈ రుణమాఫీ మొత్తం వడ్డీలకే సరిపోయిందని చెప్పారు. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికలను అడ్డు పెట్టుకుని రైతు బంధు ఎగ్గొట్టిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు. ఆయన ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను తమప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాలో వేశామన్నారు. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే అన్నారు. ఇందులో మిత్తికి పోగా నికరంగా ఆయన చేసిన రుణమాఫీ కేవలం రూ.3 వేల కోట్లు అన్నారు. అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ ఊర్లో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో లెక్కలు చెబుతామన్నారు. సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా వేస్తున్నామన్నారు. జనవరి 26న రైతు భరోసాను ప్రారంభించామని.. మార్చి నెలాఖరు వరకు పూర్తి చేస్తామన్నారు. మార్చి 31 లోగా రూ.10 వేల కోట్లు రైతుభరోసా వేస్తామన్నారు.భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు.మొదటి ఏడాదిలోనే 55,142 ఉద్యోగ నియామకాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిది అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. దళితుల కోసం మూడెకరాలు, దళిత సీఎం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి హామీలను ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్ దే అన్నారు. అది ప్రజల్ని మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

### లైకులపై పోజులా..?

పదేళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ సోషల్ మీడియాలో తనకు లైకులు వచ్చాయని గొప్పలు చెప్పుకుంటున్నారని సీఎం ఆరోపించారు. దీన్ని బట్టి ఆయన మానసిక స్థితి ఎట్లుందో అర్థం చేసుకోవాలన్నారు. బీసీ కులగణన,మాదిగ వర్గీకరణపై ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ పెడుతున్నామని..దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి కాలం చెల్లిన రూ. వెయ్యి నోటు లాంటిదన్నారు. ప్రజా సంక్షేమం అహర్నిశలు పాటు డుతున్న తమ ప్రభుత్వాన్ని అభినందించడానికి మనసు రాకపోతే ఫామ్ హౌస్ లో పడుకోవాలని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని యూనివర్శిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని,బీఆర్ఎస్ హయాంలో యూనివర్శిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యూనివర్శిటీల ప్రక్షాళన చేపట్టి, వీసీలను నియమించామని ఆయన గుర్తు చేశారు.



# నేను కొడితే మాములుగా ఉండదు

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

### రియల్ ఎస్టేట్ గతి తప్పింది

కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తున్నదని అభిప్రాయపడ్డారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో



పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉన్నదన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

### పోరాటంతో ప్రభుత్వం మెడలు వంచుడే

బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మన దేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలి రావాలని కోరారు.

# విలేఖరినని బెదిరించిన ముఠా అరెస్ట్

**ప్రభుత్వ ఉద్యోగి వద్ద రూ.8 లక్షల టోకరా**
**వివరాలు వెల్లడించిన**
**జగిత్యాల డీఎస్పీ రఘుచందర్**

కలంజ్యోతి, జగిత్యాల : జర్నలిస్టునంటూ బ్లాక్మెయిల్ కు పాల్పడి ప్రభుత్వ ఉద్యోగి వద్ద డబ్బులు గుంజిన ముఠాను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఈ మేరకు జగిత్యాల పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పరిశ్రమల శాఖ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎర్ర యాదగిరికి వద్దకు జనవరి 20వ తేదీన భూక్య సంతోష్ అనే వ్యక్తి వచ్చి రిపోర్టర్ గా పరిచయం చేసుకున్నాడు. తర్వాత ఒక కారు విషయంలో సబ్సిడీ కావాలంటూ మాట్లాడి బాధితుడికి తెలియకుండా రూ.5వేలు ఇస్తూ సీక్రెట్ గా వీడియో తీశారు. తర్వాత ఆ వీడియో చూపి బెదిరించడమే కాక మరికొందరితో కలిసి కారులో మరో చోటుకు తరలించి డబ్బులు డిమాండ్ చేశారు.



దాంతో భయపడిన బాధితుడు యాదగిరి పలు దఫాలుగా మొత్తం ఎనిమిది లక్షల 50 వేల రూపాయలు ముఠా సభ్యులకు అందజేశాడు. అయితే అంతటితో ఆగని నిందితులు మరికొంత డబ్బు కావాలని డిమాండ్ చేయడంతో బాధితుడు యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న భూక్య సంతోష్, పాలకుర్తి రాకేష్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. సమావేశంలో జగిత్యాల టౌన్ సిఐ వేణుగోపాల్, ఎస్సై కిరణ్ పాల్గొన్నారు.

# దుండిగల్ మున్సిపల్ కమిషనర్ గా వెంకటేశ్వర్ నాయక్

### శుభాకాంక్షలు తెలిపిన కొలను హనుమంతు రెడ్డి

కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ : దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ గా వెంకటేశ్వర్ నాయక్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతన్న వారికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు హరినాయక్, ఎల్లుగారి వేణు పాల్గొన్నారు.



కలంజ్యోతి 3
శనివారం 01.02.2025 Local News



# చివరి మడి వరకూ నీరందిస్తాం

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కలంజ్యోతి, కొడిమ్యాల :** చొప్పదండి నియోజకవర్గంలో చివరి మడి వరకు సాగు నీరు అందిస్తాం అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. శుక్రవారం కొడిమ్యాల మైసమ్మ చెరువు నుండి పోతారం రిజర్వాయర్ కు పంపులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క ఎకరం కూడా నీళ్లు లేకుండా ఎండిపోవడం చొప్పదండి నియోజకవర్గంలో జరుగదన్నారు. రైతులు నీళ్ల కోసం ఎదిరిచూడకముందే నీళ్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరీ నారాయణగౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి, నాయకులు గుడి మల్లికార్జున్ రెడ్డి, పిడుగు ప్రభాకర్ రెడ్డి, ముత్యం శంకర్, చంద్రమోహన్ రెడ్డి, గాజుల అజయ్, గోల్కొండ రాజు, జలంధర్, లక్ష్మారెడ్డి, వడ్లకొండ హన్మాండ్లు పాల్గొన్నారు.



# బాసరలో భక్తులకు ఇబ్బంది రావొద్దు

## నిర్మల్ కలెక్టర్ అభిలాష



**కలంజ్యోతి, నిర్మల్ :** వసంత పంచమికి బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాసర లో పర్యటించిన కలెక్టర్ వసంత పంచమి వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. గోదావరి పుష్కర ఘాట్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రదేశంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలని సూచించారు. గోదావరి నదిలో స్నానం చేసిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా అవసరమైన గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన విద్యుత్ దీపాలను అమర్చాలని సూచించారు.

బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ కు ఆలయ పూజారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వసంత పంచమి వేడుకల నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాసరలో ఫిబ్రవరి 1 నుండి 3 వరకు వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారు లను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల పర్యవేక్షణకు భైంసా ఆర్డిఓ ను ప్రత్యేక అధికారిగా నియమించి నట్లు తెలిపారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ దర్శనానికి అనుమతించాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, బయోటాయిలెట్ లను ఏర్పాటు చేయాలన్నారు. శిశువులకు పాలిచ్చేందుకు వీలుగా బేబీ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి పుష్కర ఘాట్, ఆలయ పరిసరాలన్నీ సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్డిఓ కోమల్ రెడ్డి, బాసర దేవాలయ ఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, మిషన్ భగీరథ ఈ సందీప్, తహసిల్దార్ పవన్ చంద్ర, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, దేవాదాయ శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి

**కలంజ్యోతి, మంచిర్యాల :** బాలికల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. శుక్రవారం భేటి బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని, చదువులపై ప్రత్యేక శ్రద్ధ కలిగి, ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. బాలికలు, మహిళల సంక్షేమం కోసం న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఏదైనా సలహా కోసం డీఎల్ఎస్ఎ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ 15100 లో సంప్రదించాలని సూచించారు. ప్రతి ఆడపిల్ల సమాజంలో భద్రతాయుతమైన జీవనాన్ని గడిపే విధంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం జిల్లా మహిళా, సంక్షేమ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఆపత్కల పరిస్థితిల్లో బాలికలు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త సౌజన్య, డిస్ట్రిక్ట్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మహమ్మద్ సందాని, మహిళా సాధికారత కేంద్రం, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## పారిశుధ్య నిర్వహణ పై శ్రద్ధ పెట్టాలి

**కలంజ్యోతి, మంచిర్యాల :** లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 2020 లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను ఫిబ్రవరి 20వ తేదీలోగా పూర్తి చేసే విధంగా అధికారులు పనులను వేగవంతం చేయాలని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో రూ.10 లక్షల నిధులతో కంపోస్ట్ షెడ్డు నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అన్ని వార్డులలో నిరంతరాయంగా ప్రతిరోజు తాగునీటి సరఫరా జరిగేలా పర్యవేక్షించాలని, వేసవి కాలం సమీపిస్తున్నందున తాగునీటి సరఫరాపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. 10 రోజులలోగా రియలెస్టిక్ బడ్జెట్ తయారుచేసి నివేదిక సమర్పించాలని, మున్సిపల్ పరిధిలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణపై పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





### ఉత్తమ ఫలితాల సాధనకు

# కృషి చేయాలి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :**

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సంసిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లో పదో తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మూడుసార్లు హాజరు విధానం ప్రారంభించామన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, ఈ ఏడు కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలన్నారు. పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెలకువలు నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు అధికారులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ పి. రామారావు, డీపీఓ శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు పద్మ, సలోమి కరుణ ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# నేరాల నివారణే లక్ష్యంగా ఉండాలి

**మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి**

**శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా ఎస్పీ నేతృత్వంలో పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు భేష్**



**కలంజ్యోతి, జగిత్యాల :**

నేరాల నివారణ లక్ష్యంగా చేయాలని మల్టీజోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి జిల్లాలో ఉన్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా నిర్వహించారు. ఈ సదర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు, పోలీస్ అధికారుల పనితీరు, జిల్లాలో నమోదైన కేసుల వివరాలను ఐజీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యల గురించి చర్చించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులకు, సిబ్బంది ఎదురవతున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మల్టీజోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థ తోనే శాంతి భద్రతల వ్యవస్థ పటిష్టంగా ఉంటాయన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. నిజాయితీ తో విధులు నిర్వహిస్తూ, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ఠలు తీసుకవచ్చే పోలీస్ అధికారులకు, సిబ్బందికి అండగా నిలుస్తాయన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, ఎస్పీ నేతృత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది శాంతిభద్రతలకు కృషి అభినందనీయమన్నారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు రఘుచంధర్, రాములు, రంగారెడ్డి, ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, రఫీక్ ఖాన్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, వేణు, వేణుగోపాల్, రామ్ నరసింహారెడ్డి, రవి, నిరంజన్ రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్ , సిబ్బంది పాల్గొన్నారు.









# కుంభమేళాలో మహిళల ఆచూకీ గల్లంతు

## వెతికేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులు


**కలంజ్యోతి, నిర్మల్/ జగిత్యాల :**

తెలంగాణ నుండి కుంభమేళాకు వెళ్లిన నలుగురు మహిళల ఆచూకీ తెలియటం లేదు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా జరుగుతున్న విషయం తెలిసిందే. కోట్లాదిమంది భక్తులు తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. కాగా గత మంగళవారం అర్ధరాత్రి జరిగిన తొక్కిసలాటలో 30 మంది దర్మరణం చెందారు. వందమందికి పైగా గాయాల పాలయ్యారు. ఈ ఘటనకు ముందే జగిత్యాలకు చెందిన ఇద్దరు, నిర్మల్ జిల్లా కడెంకు చెందిన ఇద్దరు మహిళలు కుంభమేళాకు చేరుకున్నారు. జగిత్యాల విద్యానగర్‌కు చెందిన నర్సవ్వ (55), కొత్తవాడకు చెందిన రాజవ్వ (55), కడెంకు చెందిన బుచ్చవ్వ (65) అక్కా చెల్లెళ్లు. కడెంకు చెందిన సత్తవ్వ (55) బుచ్చవ్వకు వియ్యంకురాలు అవుతుంది. వీరితోపాటు మరో ఏడుగురు మహిళలు కలిసి మొత్తం 11 మంది ఈ నెల 20న కుంభమేళాకు తరలి వెళ్లారు. శుక్రవారం ఉదయం నుంచి ఈ నలుగురు మహిళలు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో అందుబాటులో లేరు. మిగతా మహిళలు క్షేమంగా ఉన్నారు. వీరి నుంచి విడిపోయిన నలుగురు మహిళలు ప్రస్తుతం ఎక్కడ, ఎలా ఉన్నారో తెలియడంలేదు. వీరి ఆచూకీ కోసం కడెం, జగిత్యాల నుంచి కుటుంబ సభ్యులు కుంభమేళా బయలుదేరి వెళ్లారు

# టీవైపీఎస్ నెన్నెల మండల అధ్యక్షుడిగా అశోక్

**కలం జ్యోతి, మంచిర్యాల :**

తెలంగాణ ఎరుకల ప్రజా సమితి నెన్నెల మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఉండాడి అశోక్, ఉపాధ్యక్షుడిగా ఉండాడి రాకేష్‌లతో పాటు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఉంద్రాళ్ళ ఎల్లయ్య పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు టీవైపీఎస్ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఉండాడి రవి, మహిళ నాయకురాలు జగన్నాధుల సత్యక్క, జగన్నాధుల శిరీష, జగన్నాధుల స్వప్న, నాయకులు ఉంద్రాల సంతోష్, జగన్నాధుల ప్రభుదేవ పాల్గొన్నారు.







### భక్తి శ్రద్ధలతో వాసవీమాత

# ఆత్మార్పణ దినం

**కలంజ్యోతి, నిర్మల్ :**

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మర్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా యంగ్ ఆర్య వైశ్య యూత్ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో పులిహోర,పండ్లు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో నాని, జొన్నల రాజు, ఉత్తూర్ వినీత్, శివ, రంజిత్ సహా పెద్ద మొత్తంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లాగే తెలంగాణ లో కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అమ్మ వారి ఆత్మర్పణ దినోత్సవం నిర్వహించాలని కోరారు.

# కుటుంబానికి మహిళే వెన్నెముఖ

## మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్





**కలంజ్యోతి, జగిత్యాల :** జీవితంలో ఏర్పరచుకున్న లక్ష్యాలను ఎదుర్కొన్న సమస్యలని తాము సాధించిన విజయాలను సాధించుకోవడనికి ఒక వేదిక ఉపయోగపడుతుందని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విరుపక్షీ గార్డెన్స్ లో 'ఆడవారికి ఆదివారం సెలవు' కార్యక్రమాన్ని జగిత్యాల సిటీ కేబుల్ అధినేత టీవీ సూర్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి మహిళే వెన్నెముఖ అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళలు ఒక ప్రణాళికా బద్దమైన కార్యచరణతో ముందుకెళ్లాలన్నారు. స్త్రీని గౌరవించినప్పుడే నవ సమాజం రూపం దాలుస్తుందన్నారు. మహిళ ఒక తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఉద్యోగిగా బహుముఖ పాత్రలు పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల్ సిటీ కేబుల్ అధినేత టీవీ సూర్యం, శృతి, జబర్దస్త్ వినోదిని, నరేష్, శ్రీనివాస్, రామకృష్ణ, గుండేటి రాజు, సత్యం, శశి, ఉషారాణి, రేణుక, కోటగిరి మంగ, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలు

### పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** కేసీఆర్ ఫామ్ హౌస్ లో కూర్చుని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ఆయన పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు ఎన్ని సార్లు సవాలు విసిరినా స్పందించని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చొని గప్పాలు కొడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మరో సారి భంగపాటు తప్పదన్నారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ ను, బీఆర్ఎస్ పార్టీని ఛీకొట్టినా ఆయన వ్యవహార శైలి, మాట తీరులో మార్పు రాలేదన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉండి మళ్లీ అధికారంలోకి వస్తామనే పగటి కలలు కనడం మానుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో కేసీఆర్ అభ్యర్థుల కోసం ఇలాంటి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఫామ్‌హౌస్ పాలన .. గడీల పాలన కోరుకోవడం లేదు. ప్రజా పాలన.. ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించడంతో ఆయన దిక్కుతోచక మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కాం లో కూరుకుపోయిన ఆయన కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు రావడంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారని అన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేయడం ఆయనకు కనిపించడం లేదా? అని అడిగారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయినా.. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఎదురుచూస్తే పట్టించుకోని కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల వరకు రేషన్ కార్డులు ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితో బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడడంతో,రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌పై అవాకులు చెవాకులు పలుకుతున్నారని అన్నారు.



## మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు..

వరుణ్ తేజ్ నటించిన 'కంచె' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ప్రగ్యా జైస్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తన ఫస్ట్ మూవీతోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. అలాగే తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందింది. దీంతో ఈ అమ్మడుకు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా వచ్చిన అవకాశాలన్నింటిలో నటిస్తూ హీరోయిన్‌గా రాణిస్తోంది. తాజాగా ఈ భామ బాలకృష్ణ సరసన 'డాకు మహారాజ్' సినిమాలో నటించింది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ తన అందాలతో విందును వడ్డిస్తున్నది ప్రగ్యా జైస్వాల్. అలా ప్రతి రోజు వెరైటీ డ్రెసెస్‌తో కుర్రకారును మెస్మరైజ్ చేస్తుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా ప్రగ్యా తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లాక్ కలర్ బ్లౌజ్, మిక్స్డ్ కలర్ శారీ కట్టుకొని ఫొటోస్ స్టిల్ ఇచ్చింది. అంతేకాకుండా.. "నేను మీ తెలుగు అమ్మాయిని.. ఈ సంవత్సరం ఇంత మెరుగ్గా ప్రారంభం అవుతుందని నేను అనుకోలేదు. కానీ జనవరి నాకు ఎంత అద్భుతమైన నెలగా మారింది. ఫస్ట్ స్టార్టింగ్ వారంలో 3 ఖండాలు ప్రయాణించాను.. అత్యంత రద్దీగా, క్రేజీగా, చాలా అలసిపోయాను. కానీ సంతోషంగా, అత్యంత సంతృప్తికరంగా అనిపించింది. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు. నా మనసు సంతోషంతో నిండుగా ఉంది. మిగిలిన సంవత్సరం వరకు వేచి ఉండలేము" అనే క్యాప్షన్ రాసుకొచ్చింది. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు.. అఖండ-2లో లేరు అంటున్నారు నిజమేనా అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

